క్లుప్తంగా

డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ఉపయోగంలోకి తెండి



సూపరింటెండెంట్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న నాయకులు

కర్నూలు(హాస్పిటల్): ఇటీవల ఆరోగ్యశాఖ మంత్రి ప్రారంభించిన డయాగ్నోస్టిక్ బ్లాక్‌ను రోగులకు ఉపయోగంలోకి తీసుకురావాలని స్థానిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డికి ఏఐవైఎఫ్ నాయకులు గురువారం వినతి పత్రం సమర్పించారు. ఆసుపత్రిలో ఒక్కో పరీక్షకు ఒక్కోచోటకు వెళ్లేందుకు రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, వెంటనే నూతన భవనాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాసులు, నగర అధ్యక్ష, కార్యదర్శులు బాబయ్య, బీసన్న, నాయకులు చంటి, కుమార్, రాజు ఉన్నారు.

ధరల నియంత్రణకు పోరాటం



మాట్లాడుతున్న పి.నిర్మల

కర్నూలు(సెంట్రల్): ధరలన నియంత్రణ కోసం సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యురాలు పి.నిర్మల అన్నారు. గురువారం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన పార్టీ నగర కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాలు ప్రజలపై విపరీతంగా భారాలు మోపుతున్నాయన్నారు. ధరల నియంత్రణ కోసం ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు దశలవారీగా పోరాటాలు చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు టి.రాముడు, కె.సుధాకరప్ప, ఆర్.నరసింహులు, కె.అరుణ, కె.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో సంబరాలు



కేక్ తినిపిస్తున్న చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): జాబిల్లిపై చంద్రయాన్–3 విజయవంతంగా కాలుమోపడంతో స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్లకు, మార్కెట్ కమిటీ అధికారులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. చైర్మన్ మాట్లాడుతూ అంతరిక్ష ప్రయోగాల్లో భారత శాస్త్రవేత్తలు చరిత్ర సృష్టించారన్నారు. ఇలాంటి మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు, వైస్ చైర్మన్ భీమేశ్వరరెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడారంగాన్ని ప్రోత్సహించాలి

కర్నూలు (టౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడారంగాన్ని ప్రోత్సహించాలని పారిశ్రామికవేత్త టీజీ భరత్ అన్నారు. గురువారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఏర్పాటు చేసిన అంతర్ పాఠశాలల తైక్వాండో పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. చిన్ననాటి నుంచి సాధన చేయడం ద్వారా ఉత్తమ క్రీడాకారులుగా రాణిస్తారన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి, ఒలింపిక్ సంఘం అధ్యక్షులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, సుందర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను గురువారం జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు ప్రారంభించారు. కార్యక్రమంలో క్రీడా సంఘం ప్రతినిధులు వెంకటేశ్వర్లు, సుధీర్, గంగాధర్, వాలీబాల్ సీనియర్ క్రీడాకారుడు జాఫర్ పాల్గొన్నారు.

సీమకు న్యాయం జరిగే వరకు పోరాటం

కర్నూలు కల్చరల్: రాయలసీమకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం బుధవారపేటలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమకు అన్యాయం జరుగుతున్నా ప్రజాప్రతినిధులెవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కర్ణాటకలో అప్పర్ భద్ర నిర్మాణాన్ని ఆపాలని, సిద్ధేశ్వరం వద్ద తీగల వంతెనకు బదులు బ్రిడ్జి కం బ్యారేజీను నిర్మించాలని ఉద్యమం చేపట్టమన్నారు. అయినా కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందన్నారు.

నేటి నుంచి సాంఘిక నాటకోత్సవాలు

కర్నూలు కల్చరల్: కళావిపంచి, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో సీక్యాంప్‌లోని టీజీవీ కళాక్షేత్రంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు సాంఘిక నాటకోత్సవాలను నిర్వహించనున్నట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వరములివ్వు తల్లీ!

- నేడు శ్రావణ శుక్రవారం.. వరలక్ష్మీవ్రతం
- పూజలకు ఆలయాల ముస్తాబు

కర్నూలు కల్చరల్: శ్రావణ మాసం వచ్చిందంటే చాలు తెలుగు లోగిళ్లన్నీ పండుగ వాతావరణాన్ని సంతరించుకుంటాయి. ఆషాడం స్తబ్దతను మెల్లగా తరిమికొడుతూ ఆనందంగా శ్రావణ లక్ష్మికి స్వాగతం చెబుతారు. శ్రావణ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజున వరలక్ష్మీ వ్రతం చేస్తారు. ఆరోజు తమ శక్తి కొలదీ లక్ష్మీదేవి రూపును చేయించి అమ్మవారిని ఆవాహన చేసి నవ విధ పిండి వంటలతో అర్చిస్తారు. అష్టైశ్వర్యాల్ని కలగజేసే అష్టలక్ష్మి రూపాన్నే వరలక్ష్మీ దేవిగా ఆరాధిస్తారు. భక్తితో పూజించిన, కొలిచిన వారికి కొంగు బంగారమై వరాలనిచ్చే మహాలక్ష్మి అమ్మవారే వరలక్ష్మీ దేవి. హిందూ సంప్రదాయంలో వరలక్ష్మి వ్రతానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. తరతరాలుగా మహిళలు, నూతన వధూవరులు ఈ వ్రతాలను ఆచరించడం సంప్రదాయంగా వస్తోంది. శ్రావణ మాసంలో పున్నమి నాటికి ముందు వచ్చే శుక్రవారం రోజున ఈ వ్రతాన్ని ఆచరించడానికి వీలుకాని వారు అదే శ్రావణ మాసంలో తర్వాత వచ్చే ఏ శుక్రవారమైనా ఈ వ్రతం చేసుకోవచ్చు.

భక్తి.. ఆరోగ్యం

వర్షా కాలంలో శ్రావణం ఆ తర్వాత భాద్రపద మాసం



వరలక్ష్మీ దేవి

సైతం వర్షాలతో కూడినవి. ఈ కాలంలో పాదాలకు పసుపు రాసుకుంటే జలుబు, రొంపి లాంటి వ్యాధులు రావు. మొలకెత్తిన శనగలను ఈ రెండు నెలలు పాటు ప్రసాదంగా తినడం వల్ల శరీరానికి పోషక విలువలతో పాటు రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఈ పండుగ వేళ ప్రతి స్త్రీ బొట్టు, కాటుక, గంధం, మెట్టెలు, పూలు, పట్టుచీర, నగలతో నిండుగా ఉంటారు. దీనివల్ల సూక్ష్మజీవులు సైతం దరి చేరవని నమ్మకం. తాంబూలం వేసుకోవటం వల్ల జీర్ణక్రియ సులభమవుతుంది. అజీర్ణ బాధలు తగ్గుముఖం పడతాయి. ఈ వ్రతాలు ఇరుగు పొరుగు వారితో బంధుమిత్రులతో కలిసి చేసుకుంటే సంబంధాలు పెరుగుతాయి. కుటుంబ వ్యవస్థ పటిష్టమవుతుంది. మానసిక రుగ్మతలు దూరమవుతాయి.

ప్రధాన ఆలయాల్లో ఏర్పాట్లు

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని అమ్మవారి ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాల నిర్వహణను పెద్ద ఎత్తున చేపడతారు. వేలాది మంది ముత్తయిదువులు సమీప ఆలాయలకు వెళ్లి అమ్మవారి సమక్షంలో వ్రతాలను ఆచరిస్తారు. వాయినాలు ఇచ్చుకోవడంతో పాటు అమ్మవారికి ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకుంటారు. జిల్లాలో శ్రీశైలం, మహానంది, అహోబిలం, నందవరం చౌడేశ్వరీ దేవి ఆలయం, మంత్రాలయం, ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయాలతో పాటు కర్నూలు నగరం సప్తగిరి నగర్ మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణలోని చౌడేశ్వరీ దేవి ఆలయం, పాతనగరంలోని చిన్న అమ్మవారి శాల, పెద్దఅమ్మవారి శాల, నిమిషాంబదేవి ఆలయం, కాళికాంబ దేవి ఆలయం, లలితా సుందరేశ్వర ఆలయం, వీఆర్ కాలనీ, కృష్ణానగర్, సంకల్ బాగ్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయాలు, దేవనగర్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయం తదితర ప్రాంతాల్లో ఈ వ్రతాలు ఆచరిస్తారు. శ్రావణ మాసంలో నదీ పుణ్య స్నానాలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటారు.

గోరింటాకు సకల సంపదలకు సంకేతం

గోరింటాకు చెట్టుకు ఎవరు పూజించి చేతులకు పెట్టుకుంటారో వారికి సకల సంపదలు, సుఖసంతోషాలు చేకూరుతాయని విశ్వాసం. ఉత్తరాదిన వివాహానికి ముందు మెహందీ కార్యక్రమాలు చేపడతారు. ఇప్పుడు ఈ సంప్రదాయం మన సంస్కృతిలో భాగమైంది. శ్రీ మహాలక్ష్మి ఆశీస్సులు నూతన వధూవరులకు అందుతాయనే విశ్వాసం. శుక్రవారం రోజున గోరింటాకు పెట్టుకొని మహాలక్ష్మిని పూజించటం, ధ్యానించడం చేస్తే మహిళలకు ఎలాంటి కష్టాలు ఉండవని పండితులు చెబుతున్నారు.



గోరింటాకు పెట్టించుకుంటున్న అతివలు

సకల సౌభాగ్యాలు కలుగుతాయి



వరలక్ష్మీ వ్రతం సకల సౌభాగ్యాలు కలగజేస్తుంది. శ్రావణ మాసంలో చేసే వరలక్ష్మీ వ్రతం పరమ పవిత్రమైంది. నిండు మనసు, నిష్టలతో మహిళలు తమ ఇళ్లలో వరలక్ష్మీ వ్రతాన్ని నోమి ముత్తయిదువులకు పసుపు, కుంకుమ, తాంబూలం అందజేస్తే సిరి సంపదలు, భోగభాగ్యాలు కలుగుతాయి.

– మామిళ్ల పల్లి జగన్మోహన శర్మ, పండితుడు

మార్కెట్‌కు 'లక్ష్మీ' కళ

వరలక్ష్మీ వ్రతంలో కలశం వద్ద కొత్తగా కొన్న బంగారు వస్తువులను ఉంచడం సంప్రదాయంగా వస్తుంది. ఈ నేపథ్యంలో వ్యాపారులు బంగారు వస్తువులను అందుబాటులో ఉంచారు. ముఖ్యంగా లక్ష్మీదేవి రూపం ఉన్న బంగారు కాసులు, చిన్న డాలర్లు, అమ్మవారి ముఖ రూపాలను ఒకటి నుంచి రెండు గ్రాముల బరువుతో తయారు చేసి విక్రయిస్తున్నారు. వీటితో పాటు వెండితో చేసిన అమ్మవారి ముఖ రూపాలను కూడా అందుబాటులో ఉంచారు. బరువును బట్టి రూ.1,500 నుంచి రూ.6,000 వరకు వీటిని విక్రయిస్తున్నారు. వీటితో పాటు పద్మాలు, ఎర్రటి కలువ పూలు, గులాబీ తదితర తొమ్మిది రకాలు పూలు కొనుగోళ్లతో మార్కెట్లు సందడిగా ఉన్నాయి. వస్త్ర దుకాణాలు, బంగారు షాపులు, పూల అంగళ్లు, టెంకాయల దుకాణాలు కొనుగోళ్లతో కిటకిటలాడుతున్నాయి.



వెండి డాలర్లు

లబ్ధిదారులను గుర్తించండి

- సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకానికి లబ్ధిదారులను గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ స్పందన అంశాలపై కలెక్టర్లు, జేసీలతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని సెప్టెంబర్ 17న ప్రారంభించనున్నట్లు చెప్పారు. 18 వృత్తుల కళాకారులకు ఈ పథకం ద్వారా బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు జరిగేలా చూడాలన్నారు. మాతృ, శిశు మరణాలు సంభవించకుండా చర్యలు చేపట్టాలన్నారు. బడి బయట ఉన్న పిల్లలు బడుల్లో చేర్పించాలన్నారు. జిల్లాలో బడి బయట ఉన్న పిల్లలను ఓపెన్ స్కూళ్లు, కాలేజీల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డికి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలి

కర్నూలు(సెంట్రల్): బూత్ లెవల్ ఆఫీసర్లు కచ్చితంగా ఇంటింటికీ వెళ్లి ఓటరు సర్వేను చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన సూచించారు. గురువారం ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మండలాధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. కొన్ని చోట్లా హౌస్‌హోల్డ్ డేటా ఆధారంగా సర్వే చేస్తున్నట్లు రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి ఫిర్యాదులొస్తున్నాయని, మరోసారి అలా జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఈకేవైసీని త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

సేవా లోపం లేకుండా పని చేయండి

కర్నూలు(రాజ్‌విహార్): వినియోగదారులకు అందించే సేవల్లో లోపం ఉండరాదని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వై.సుబ్బన్న సూచించారు. గురువారం ఆయన స్థానిక పవర్ హౌస్‌లోని తన కార్యాలయంలో కింది స్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌర సేవాపత్రం ప్రకారం సేవలందించాలని, ఇది కర్తవ్యమని వెల్లడించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని, అలసత్వం ఉంటే ఉన్నతాధికారుల శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశాలున్నాయని హెచ్చరించారు.

రజకుల సాంఘిక భద్రతకు చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): రజకుల సాంఘిక భద్రతకు ఎస్సీ, ఎస్టీ తరహాలో సామాజిక రక్షణ చట్టం తేవాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం కార్మిక కర్షక భవన్‌లో అపార్టుమెంట్ వాచ్‌మెన్ రజక వృత్తిదారుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికీ రజకుల సంఘ బహిష్కరణలు జరుగుతున్నాయన్నాన్నారు. అపార్టుమెంట్లలో కులవృత్తి చేసే రజకుల సంక్షేమానికి సంబంధిత అపార్టుమెంట్ యజమానులు చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని బళ్లారీ చౌరస్తా ఏరియాలో చేపడుతున్న అభివృద్ధి పనుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు టౌన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గీత నగర్, నిర్మల్ నగర్, ఠాగూర్ స్కూల్ ఏరియా, జంగాల కాలనీ, స్కందాన్షి షాపింగ్ మాల్, రమేష్ హాస్పిటల్ ఏరియా, డీమార్ట్, ఎన్‌హెచ్ 44 తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి సహకరించాలని కోరారు.

లారీల పట్టివేత

కర్నూలు (న్యూసిటీ): చిప్పగిరి మండల కేంద్రం వద్ద అనుమతులు లేకుండా నాపరాయి లోడ్‌తో వెళ్తున్న రెండు లారీలను గురువారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, పోలీసులు పట్టుకున్నారు. జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపిన వివరాలు.. వాహనాల తనిఖీలో నాపరాయి లారీలను గుర్తించి రూ.80 వేలు జరిమానా విధించారు. కాగా ఆదోని మండలం ఎస్.కొండాపురంలో ఇటీవల పట్టుబడిన రెండు ట్రాక్టర్లు, టిప్పర్ యజమానులకు రూ.20 వేల చొప్పున జరిమానా విధించినట్లు డీడీ తెలిపారు.

భగవద్గీత శ్లోకాల పోటీలు

కర్నూలు కల్చరల్: నగరంలోని పలు పాఠశాలల్లో చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో గురువారం భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందించేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు మిషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద తెలిపారు. నగరంలోని మాంటిస్సోరి, కేశవరెడ్డి, శ్రీజ, శ్రీలక్ష్మి, రవీంద్ర, సెయింట్ జోసెఫ్స్, ఇండస్, ఎస్‌ఏపీ క్యాంప్ నగరపాలకసంస్థ పాఠశాలల్లో పోటీలు నిర్వహించామన్నారు. సుమారు 3 వేల మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారన్నారు. విజేతలను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

నగర అభివృద్ధికి ప్రాధాన్యత



శిలాఫలకం ఆవిష్కరించిన మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): నగరాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు మేయర్ బీవై రామయ్య తెలిపారు. గురువారం స్థానిక 48వ వార్డు పరిధిలోని రోజా వీధి, సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల వద్ద రూ. 1.46 కోట్లతో సీసీ రోడ్డు, డ్రైనేజీ, బీటీ రోడ్డు విస్తరణ పనులకు కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని 52 వార్డుల్లో ప్రజలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు విశేష కృషి చేస్తున్నామన్నారు. అలాగే నగర సుందరీకరణ, తాగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఏర్పడిన అనేక సమస్యలను వైఎస్సార్‌సీపీ ప్రస్తుతం పరిష్కరిస్తోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మల్లికాబేగం, విక్రమసింహారెడ్డి, షాషావలీ, కోఆప్షన్ మెంబర్ నయింపాషా, ఎస్ఈ వేణుగోపాల్, ఎంఈ షాకీర్ హుస్సేన్, డీఈఈ నరేష్, ఏఈ ప్రవీణ్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు నిర్మించాలని వినతి

కమ్యూనిటీ హాలు నిర్మించాలని 17వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు కైపా పద్మాలతారెడ్డి, స్థానిక వార్డు పెద్దలు గురువారం నగర మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌లను కలిసి విన్నవించారు. నగరపాలక కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో వారిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు విక్రమసింహారెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, చిత్రంలో మేయర్ రామయ్య

కల్లూరు: నగర పాలక సంస్థలో విలీనమైన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య తెలిపారు. గురువారం కల్లూరు అర్బన్ 28వ వార్డులోని లక్ష్మీపురం గ్రామంలో వారు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి పథకాల అమలుపై ఆరా తీశారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు తమ దృష్టికి తీసుకొస్తే పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. నాలుగేళ్లలో ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరించి, బుక్‌లెట్‌ను అందజేశారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నారాయణరెడ్డి, శ్రీనివాసులు, శ్వేతారెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, లక్ష్మిరెడ్డి, గ్రామ నాయకులు సత్యంరెడ్డి, సుబ్రమణ్యం శెట్టి పాల్గొన్నారు.

క్లీనర్‌కు తీవ్ర గాయాలు

పాణ్యం: శాంతిరాం ఫార్మసీ కళాశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్సు క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గురువారం హైవే పెట్రోల్ సిబ్బంది తెలిపిన వివరాలు.. ఆర్‌జీఎం కళాశాల బస్సు కర్నూలు నుంచి కళాశాలకు వెళ్లే క్రమంలో యూటర్న్ చేసుకుంటుండగా నంద్యాల నుంచి తమ్మరాజుపల్లెకు వెళ్తున్న టిప్పర్ బస్సును ఢీకొంది. ప్రమాదంలో బస్సు క్లీనర్ ఉస్మాన్‌కు కాలు, చెయ్యి విరిగిపోయాయి. తలకు తీవ్ర గాయమైంది. ఆస్పత్రికి తరలించారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా నరసింహులు

కర్నూలు(సెంట్రల్): కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా పెద్దకడబూరుకు చెందిన కురువ నరసింహులును నియమిస్తూ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో గురువారం కురువ నరసింహులకు డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు, ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ గుప్తా నియామకపత్రం అందజేశారు.

పంటలు కాపాడుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున పంటలను కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో ఆత్మ ఆధ్వర్యంలో కర్నూలు, పత్తికొండ సబ్ డివిజన్ల రైతులతో శాస్త్రవేత్తల ముఖాముఖీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. రైతుల అనుమానాలను శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం, యాగంటి పల్లి కేవీకే ప్రధాన శాస్త్రవేత్తలు సుజాతమ్మ, ధనలక్ష్మి, యాగంటిపల్లి కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త ఆదినారాయ, ఆత్మ డీపీడీ శ్రీలత, జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు, కర్నూలు, పత్తికొండ ఏడీఏలు సాలురెడ్డి, మహమ్మద్‌ఖాద్రీ, ఆత్మ ఏఓ మధుమతి, పశుసంవర్ధక అధికారి డాక్టర్ చెన్న కేశవులు పాల్గొన్నారు.

పేదల బతుకులు మార్చేందుకే సంక్షేమ పథకాలు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్రంలో పేదల బతుకులు మార్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. గురువారం రాత్రి ఆయన స్థానిక 52వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సాయిబాబా నగర్ ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యలను పరిష్కరించాలని అధికారులను సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ఆర్థికంగా ఎదగాలన్న లక్ష్యంతోనే నవరత్నాల ద్వారా సంక్షేమ పథకాలు తెచ్చినట్లు చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకుని పొందాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్ అహ్మద్, నాయకులు సర్దార్, మహేష్, రమణ, మునిస్వామి, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదపుటంచున..!

జిల్లా కేంద్రంలోని పెద్దాస్పత్రి భవనంపై కార్మికులు ప్రమాదపుటంచున పని చేస్తున్నారు. ఎలాంటి రక్షణ కవచాలు సమకూర్చకుండా నిర్వాహకులు పనులకు పురమాయించడంతో ఐదంతస్తుల భవనంపై ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని హోర్డింగ్ పనులు చేస్తున్నారు. అటుగా వెళ్తున్న పలువురు చూసి.. జరగరానిదేదైనా జరిగితే కార్మికుల కుటుంబాలకు దిక్కెవరని ఆందోళన వ్యక్తం చేశారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్, కర్నూలు

టిడ్కో ఇళ్లను సిద్ధం చేయండి



టిడ్కో ఇళ్ల సమాచారం అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): నగర శివారులోని టిడ్కో ఇళ్లను సిద్ధం చేయాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ టిడ్కో ఇంజినీర్లను ఆదేశించారు. గురువారం స్థానిక జగన్నాథ గట్టులోని జగనన్న నగర్, టిడ్కో ఇళ్లను కమిషనర్ పరిశీలించారు. సంబంధిత టిడ్కో ఇంజినీర్లతో ఇళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జగనన్న నగర్‌లో 10 వేల టిడ్కో ఇళ్లు నిర్మించినట్లు చెప్పారు. ఇందులో లబ్ధిదారులకు ఇచ్చేందుకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. ఇప్పటికే 2,064 ఇళ్లలో అన్ని సదుపాయాలు ఉన్నందున లబ్ధిదారులకు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ సరఫరా, తలుపులు, కిటికీలు వంటి మౌలిక సదుపాయాలు పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ తనిఖీల్లో టిడ్కో ఎస్ఈ రాజశేఖర్, డీఈ రవి గుప్త, టిడ్కో ఏఈ పార్షియా, ఈఈ శేషసాయి, డీఈఈ ప్రకాష్ నాయుడు, డీఈ నరేష్ పాల్గొన్నారు.